సాక్షి మంచిర్యాల

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



భయం వీడితే జయమే..

ఇంటర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఒత్తిడి వీడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. 8లో▸



27న సంత్ సేవాలాల్ జయంతి

పాతమంచిర్యాల: సంత్ సేవాలాల్ జయంతిని మంచిర్యాలలో 27న నిర్వహించనున్నట్లు సంత్ సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సపాట్ శంకర్, ప్రధాన కార్యదర్శి బదావత్ ప్రకాష్‌నాయక్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

గరిష్టం/కనిష్టం
33.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గూడెంలో ఘనంగా మాఘపౌర్ణమి జాతర



దర్శనానికి బారులు తీరిన భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో మాఘపౌర్ణమి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. సుమారు 252 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. కాగా, ఈ నెల 18 నుంచి ఆలయంలో సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం నిత్యవిధి, ప్రాభోదికి ఆరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, హవనము, నిత్యహోమాలు తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న ఆర్డీవో రాములు

మంచిర్యాలఅగ్రికల్చర్: అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల ఆర్డీవో రాములు అన్నారు. శనివారం మంచిర్యాల నియోజవర్గానికి సంబంధించిన సెక్టోరల్ అధికారులు, సిబ్బందితో రాబోయే పార్లమెంటు ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్టర్ ట్రైనర్, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, ఎన్నికల అధికారి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే వినోద్



సీఎంతో వినోద్, షబ్బీర్ అలీ

బెల్లంపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగం సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి హైదరాబాద్ ఎయిర్ ఫోర్టు వీఐపీ లాంజ్‌లో భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో వివరాలు ఆరా తీస్తున్న ఏసీపీ

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నేరాలు, ఇతర కేసులకు సంబంధించి పూర్తి వివరాలు ఆరా తీశారు. సిబ్బంది వివరాలు, విధుల కేటాయింపులు, విధుల నిర్వహణ తెలుసుకుని సూచనలు చేశారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జేఏఓ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్



రాజ్‌కుమార్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్(జేఏఓ) ఫలితాలు గురువారం వెలువడగా హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బట్టల రాజ్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించాడు. మొదటి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, కాళేశ్వరం జోన్ పరిధిలో మొదటి ర్యాంకు సాధించాడు. రాజ్‌కుమార్‌గౌడ్ తండ్రి గంగాధర్‌గౌడ్ జైపూర్ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసేవాడు. పదో తరగతి చదువుతున్న సమయంలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి సునీత కారుణ్య నియామకం కింద మందమర్రిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సబ్ ఆర్డినేట్‌గా ఉద్యోగం చేస్తోంది. తండ్రి మరణంతో చదువుకు ఆటంకం ఏర్పడి పరిస్థితి నెలకొనగా తన తాత కోట దుబ్బయ్యగౌడ్ చేరదీసి ఉన్నత చదువులకు చేయూతనందించాడు. బీకాం డిగ్రీ పూర్తి చేసి సీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తాజా ఫలితాల్లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు.

అమృత్ స్టేషన్



నిర్మాణంలో ఉన్న సీవోపీ

- మంచిర్యాల రైల్వేస్టేషన్ ఆధునీకరణ
- అమృత్ భారత్ స్టేషన్ స్కీంకు ఎంపిక
- రేపు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- మూడు రోడ్ అండర్ బ్రిడ్జిలు ప్రారంభం



26న నిర్వహించే కార్యక్రమం కోసం ఏర్పాట్లు



ప్రధాని మోదీ ప్రారంభించనున్న ఐబీ తాండూరు వారసంత సమీపంలోని రోడ్ అండర్ బ్రిడ్జి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైల్వేస్టేషన్ ఆధునీకరణ, సౌకర్యాల పెంపు కోసం చేపట్టిన అమృత్ భారత్ స్టేషన్ స్కీం(ఆర్‌బీఎస్‌ఎస్) కింద మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇప్పటికే ఈ పథకం కింద స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ అధికారికంగా ప్రారంభించలేదు. దీంతో దేశవ్యాప్తంగా రెండో విడత ఆర్‌బీఎస్‌ఎస్‌లో ఎంపిక చేసిన 500 స్టేషన్లను ఆధునీకరించనున్నారు. రెండో విడతలో జిల్లా కేంద్రంలోని మంచిర్యాల స్టేషన్ అభివృద్ధికి రూ.26కోట్లు మంజూరయ్యాయి. స్టేషన్ ఆధునీకరణతోపాటు ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. పనులు మొదలైన వాటితోపాటు ప్రారంభించే వాటిని వచ్చే జూలైలో పూర్తి చేయాలని లక్ష్యంగా ఉంది. దీంతో జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌కు సౌకర్యాలు మెరుగయ్యే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా ఇక్కడ అసౌకర్యాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

మరిన్ని సదుపాయాలు..

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోజువారీగా రూ.లక్షల ఆదాయం తెస్తోంది. రైల్వే ప్రయాణికులతోపాటు సరుకు రవాణాతో భారీగా ఆదాయం ఆర్జిస్తోంది. జిల్లా నుంచి బొగ్గుతోపాటు సిమెంటు ఇతర పరిశ్రమల నుంచి సరుకును గూడ్స్ రైళ్లలో తరలిస్తుండడంతో ఆదాయం వస్తోంది. ఆ మేరకు సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలు తొలగించేందుకు రైల్వేస్టేషన్ ఆధునీకరణ చేయనున్నారు. ఈ అమృత పథకంలో భాగంగా కొత్త రైల్వే భవనాలు, ప్రయాణికుల విశ్రాంతి హాళ్లు, దివ్యాంగులు, మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు, విశ్రాంతిభవనాలు, ఎస్కలేటర్, ఫుట్ ఓవర్‌బ్రిడ్జి, స్టేషన్ పరిసరాల సుందరీకరణ, ప్రస్తుతమున్న పార్కింగ్ సౌకర్యం పెంపు, టు, త్రీ, ఫోర్ వీలర్ వాహనాల కోసం విస్తరించనున్నారు. ఇక ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు వేర్వేరుగా దారులు, వ్యాపార సముదాయాలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పుడున్న ప్లాట్‌ఫాం కొంత మేరకు షెడ్‌లు ఉన్నాయి. దీంతో మరింత పొడగిస్తూ, సీవోపీ (కవర్ ఓవర్ ప్లాట్‌ఫాం) ఇతరత్రా సౌకర్యాలు కల్పించనున్నారు. ఎస్కలేటర్ సౌకర్యం వస్తే మెట్లపై నడవలేని వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం మెట్ల మార్గం, లిఫ్టు సౌకర్యం ఉంది. రైల్వే స్టేషన్ ఒక వైపు మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు. రెండో వైపు హమాలీవాడ వైపు నాలుగో ప్లాట్‌ఫాం నుంచి బుకింగ్ కౌంటర్లు, రాకపోకలకు అవకాశాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మూడు ఆర్‌యూబీలు ప్రారంభం

మంచిర్యాల పట్టణం మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి) ఇప్పటికే పనులు పూర్తయి రాకపోకలు సాగుతున్నాయి. వీటిని అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది. రేచినీ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఆర్‌యూబీ, ఐబీ తాండూరు కొత్తపల్లి వార సంతలోని ఆర్‌యూబీ, కాగజ్‌నగర్, రాళ్లపేట వద్ద మధ్య ఉన్న ఆర్‌యూబీలను సైతం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ ఆర్‌యూబీలు ఉన్న చోట్ల గతంలో లెవల్‌క్రాసింగ్ ఉండేవి. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో గేట్ల వద్ద ప్రయాణికుల నిరీక్షణ తప్పింది.

భారీగా ఏర్పాట్లు..

ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు జిల్లా కేంద్రంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులను ఆహ్వానించి అట్టహాసంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని ప్రముఖులకు ఆహ్వానాలు అందాయి. ఈ మేరకు రైల్వేస్టేషన్ సమీపంలోనే ఏర్పాట్లు చేస్తున్నారు.

వచ్చే జూలైలోపు పూర్తి

అమృత్ భారత్‌లో భాగంగా చేపట్టిన పనులను వచ్చే జూలైలోపు పూర్తి చేయాలనే లక్ష్యంగా ఉంది. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. మిగతావి పూర్తి చేస్తాం.

– గుప్తా, ఏడీఈఎన్, రామగుండం

ఏర్పాట్లు చేస్తున్నాం

రైల్వే ప్రయాణికుల సౌకర్యాలు మరింత పెంచేందుకు మంచిర్యాల రైల్వేస్టేషన్ మరింత ఆధునీకరణ జరగనుంది. ఈ నెల 26న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్న పనులకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– వి.రవికుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, మంచిర్యాల

యాష్ వినియోగంపై ఎస్టీపీపీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఈడీ బసివిరెడ్డి

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. దక్షిణ ప్రాంతాల్లో 500మెగావాట్ల కంటే ఎక్కువ 100శాతం యాష్ వినియోగాన్ని సాధించినందుకు గాను జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటుకు మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ చిన్న బసివిరెడ్డి, వోఅండ్ఎం చీఫ్ జీఎస్ సింగ్ శనివారం గోవాలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ మార్గదర్శకత్వంలో వంద శాతం యాష్ వినియోగం సాధించడంపై సింగరేణి సంస్థ చైర్మన్ బలరాం అధికార బృందాన్ని అభినందించారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు జిల్లా కేంద్రంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షలకు 343 మందికి గాను 250 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 343 మందికి గాను 249 మంది హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ దామోదర్ రావు పరిశీలించారు.

వాలంటీర్ల పేరుతో వసూళ్లు!

- జూనియర్ కాలేజీల్లో సిబ్బంది నియామకం
- సొంతంగా ఉత్తర్వులు ఇస్తున్న ఓ సంస్థ
- కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నిర్వాకం



జూనియర్ కాలేజీలో నియమిస్తూ ఉత్తర్వు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వాలంటీర్లుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షలు వసూలు చేస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. గత కొన్ని రోజులుగా కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఓ సంస్థ నిరుద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతోంది. కంప్యూటర్ ఆపరేటర్, నైట్‌వాచ్‌మెన్, హెల్త్ అసిస్టెంట్ వాలంటీర్ల పేరుతో ఈ నియామకాలు చేపడుతోంది. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకున్నా వాలంటీర్లుగా విద్యాసంవత్సరం చివరలో పలు కాలేజీల్లో సిబ్బంది నియామకం చేపట్టడం అనుమానాలకు తావిస్తోంది.

తామే జీతమిస్తామని..

'విద్యాదాన్' సంస్థ జూనియర్ కాలేజీల్లో అవసరమున్న చోట 'విద్యాంజలి 2.0' వాలంటీర్ కార్యక్రమం కింద 2023–27 విద్యాసంవత్సరాలకు సిబ్బందిని నియమిస్తున్నట్లు చెబుతున్నారు. వాలంటీర్లుగా చేరిన వారికి తమ సంస్థ నుంచే జీతాలు చెల్లిస్తామని చెబుతూ ఉత్తర్వుల కాపీలు చూపిస్తున్నారు. ఈ ఉత్తర్వులు ఇటు జిల్లా కలెక్టర్ల నుంచి గానీ జిల్లా, రాష్ట్ర, విద్యాశాఖ నుంచి గానీ లేకపోవడం గమనార్హం. కేవలం ఆ సంస్థ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వుల మేరకు అని పేర్కొని ఉన్న ఆ సంస్థ పేరుతోనే ఆర్డర్ కాపీలు ఉన్నాయి. ఆ సంస్థనే వాలంటీర్లుగా నియమిస్తూ, సంస్థనే జీతాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, నైట్‌వాచ్‌మెన్‌లు, హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. జూనియర్ కాలేజీ విద్యార్థులకు నైట్ వాచ్‌మెన్, హెల్త్ అసిస్టెంట్ ఏం పని చేస్తారనేది ప్రశ్నగా మారింది. సాధారణంగా వసతి సౌకర్యం ఉన్న చోటే విద్యార్థులకు ఈ సిబ్బంది అవసరం అవుతుంటారు. కానీ ఇంటి నుంచే రోజూ రాకపోకలు సాగించే విద్యార్థులకు ఈ వాలంటీర్లు ఎలా ఉపయోగపడుతారనేది సందేహంగా మారింది. మరోవైపు విద్యాంజలి పథకం విద్యార్థుల కోసం ఉద్దేశించింది. ప్రభుత్వ స్కూళ్లలో స్వచ్ఛందగా స్థానికులు ఎవరైనా వాలంటీర్లుగా పని చేసేందుకు వస్తే ఉచితంగా బోధించడంతోపాటు ఏ రూపంలోనైనా సాయమందించడం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్. దీనిని కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలో స్కూల్ ఎడ్యుకేషన్, లిటరసీ కింద చేపట్టారు. ఈ కార్యక్రమం జూనియర్ కాలేజీల్లో ఎక్కడా అమలు చేయలేదు.

రూ.లక్ష నుంచి రూ.2లక్షలు

వాలంటీర్‌గా నియమిస్తూ, వారి నుంచి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. సిబ్బందికి నెలకు రూ.12వేల నుంచి రూ.18వేల వరకు జీతం వస్తుందని చెబుతున్నారు. ముందు కొంత ముట్టజెప్పాక, నెల జీతం వచ్చాక పూర్తిగా ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటికే పలు కాలేజీల్లో వీరికి ఉత్తర్వులు ఇచ్చారు. మంచిర్యాల జిల్లా నుంచి కొందరు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఓ జూనియర్ కాలేజీలో నియామకం చేసుకున్నారు. వారికి ప్రత్యేకంగా రిజిష్టర్ పెట్టి హాజరు వేసుకుంటున్నారు. దీనిపై ఆసిఫాబాద్ జిల్లా ఇంటర్మీడియెట్ అధికారులను సంప్రదించగా.. ఆ సంస్థనే సిబ్బందికి జీతాలు చెల్లిస్తుందని, విద్యాశాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విధుల్లోకి తీసుకున్నట్లు చెప్పారు. మంచిర్యాల జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శైలజను సంప్రదించగా.. వాలంటీర్లుగా నియామకం కోసం కొందరు వచ్చారని, స్పష్టమైన ఉత్తర్వులు లేవని చెబితే మళ్లీ రాలేదని తెలిపారు. ఇక ఈ వాలంటీర్ల నియామకంపై ఆ సంస్థ నిర్వాహకులను పలుమార్లు ఫోనులో సంప్రదించాలని ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ప్రత్యేక అధికారులకు 'పవర్' లేదు

- పంచాయతీల్లో చెల్లింపులకు బ్రేక్
- ప్రభుత్వం నుంచి అందని ఉత్తర్వులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వీరు బాధ్యతలు చేపట్టి 24రోజులు గడుస్తున్నా వారికి చెక్‌పవర్ కల్పించకపోవడంతో వివిధ రకాల చెల్లింపులకు బ్రేక్ పడింది. పాలకవర్గం ఉన్న సమయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు కలిపి చెక్‌పవర్ ఉండేది. ఈ నెల ఒకటి నాటికి పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో 2నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. గజిటెడ్ స్థాయి అధికారులను పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమించగా.. ఒక్కో అధికారికి రెండు మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. పంచాయతీల్లో జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి ప్రత్యేక అధికారులకు చెక్‌పవర్ కల్పించాల్సి ఉంది. ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శికి కలిపి జాయింట్ చెక్‌పవర్ ఉంటుందని అధికారులు తెలిపారు. ఆర్థిక సంఘం నిధుల వినియోగం కోసం ప్రత్యేక అధికారులకు డిజిటల్ కీ ఇవ్వాల్సి ఉంది. జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ నిధుల వినియోగం కోసం బ్యాంకు చెక్‌లపై సంతకాలు మార్పించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందకపోవడంతో చెక్ పవర్ అంశం పెండింగ్‌లో ఉంది. దీంతో పంచాయతీల్లో సిబ్బందికి వేతనాల చెల్లింపులు, పంచాయతీల నిర్వహణ, ఇతర బిల్లుల చెల్లింపుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ క్రమంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుండగా స్థానికులు ఇటు ప్రభుత్వ తీరుతోపాటు అధికారుల వ్యవహారంపై మండిపడుతున్నారు. కనీసం గ్రామాల అభివృద్ధికైనా సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి ప్రత్యేక అధికారులకు చెక్‌పవర్ కల్పించాలని కోరుతున్నారు.

అభివృద్ధిని మరిచిన రాష్ట్ర ప్రభుత్వం

- ఆరు గ్యారంటీల అమలులో కాలయాపన
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

మంచిర్యాలటౌన్: తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి గత ప్రభుత్వ అప్పులు, కాళేశ్వరం ప్రాజెక్టులోని లోపాలను ఎత్తి చూపిస్తూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాలయాపన చేస్తోందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి విమర్శించారు. బీజేపీ సంకల్ప యాత్రలో భాగంగా మంచిర్యాలకు వచ్చిన ఆయన శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలకు కారణమైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వచ్చే వేసవిలో నీటి కొరత లేకుండా కనీస చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. 2028లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, లేనిపక్షంలో తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కొప్పు భాష, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, రజనీశ్ జైన్, రావుల రామ్‌నాథ్, మున్నరాజ్ సిసోడియా, తుల ఆంజనేయులు, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, బండి మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

జనం నుంచి వనంలోకి..



పాలవాగు వద్ద వనంలోకి దేవతలను తీసుకెళ్తున్న పూజారులు

- ముగిసిన సమ్మక్క–సారలమ్మ జాతర
- మొక్కులు తీర్చుకుని భక్తుల తిరుగుప్రయాణం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల గోదావరి నదీ తీరాన మూడు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతర శనివారం ముగిసింది. చివరి రోజు భక్తులు మొక్కులు చెల్లించి తిరుగు ప్రయాణం కావడంతో హడావుడి కనిపించింది. ఉదయం 10.30గంటలకు పూజారి క్రిష్ణదొర ఆధ్వర్యంలో సమ్మక్క–సారలమ్మలను వన ప్రవేశం చేయించారు. జాతర ప్రత్యేకాధికారి రంగు రవికిషన్‌గౌడ్, ఈవో ముక్తా రవి, పూజారి క్రిష్ణ వనదేవతలకు గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి గౌతమేశ్వర ఆలయ సమీపంలోని చెట్లపొదల్లో ఇల్లారిలో దేవతలను వన ప్రవేశం చేయించారు. జాతర చివరి రోజు కూడా భక్తులు వందలాదిగా తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల తిరుగు ప్రయాణంతో నదీతీరం తాత్కాలిక గుడారాలు లేక బోసిపోయింది. జాతర, వనప్రవేశం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ వాటర్‌ట్యాంకర్ల తాగునీరు, స్నానాల ఘట్టాల వద్ద భక్తుల స్నానాలకు కళాయిలు ఏర్పాటు చేశారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవార్ల జాతరలో పాస్‌ల విషయంలో వివాదం నెలకొంది. వాలంటరీల పేరిట రాజకీయ నాయకుల హడావుడి సాగింది. పాత్రికేయులకు పాస్‌లు జారీ చేయకపోవడంతో తరచూ ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ఇటిక్యాలలో

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మక్క–సారలమ్మ జాతర శనివారం ముగిసింది. అమ్మవారి విగ్రహాలను పూజారులు వన ప్రవేశం చేయించారు. గత రెండు రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



మంచిర్యాలలో దేవతల వన ప్రవేశం

ఆర్కే1ఏ గని శివారులో..

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ ఆర్‌కే1ఏ గని శివారులో వనదేవతలు శనివారం సాయంత్రం వనప్రవేశం చేశారు. గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో పూజలు చేసిన అనంతరం వనంలోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆర్‌కే1ఏ మేనేజర్ జయంత్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జాతర హుండీ లెక్కింపు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల గోదావరి నదీ తీరాన నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ లెక్కించారు. శనివారం ఇద్దరు ఎస్సైలు, పది మంది పోలీసుల పర్యవేక్షణలో సీసీ కెమెరాల మధ్య దేవాదాయ, ధర్మదాయశాఖ సిబ్బంది, జాతర సేవా కమిటీ సభ్యులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటరీలు 52 మంది ఎనిమిది హుండీల లెక్కింపు చేపట్టారు. రూ.14,22,693 నగదు, రెండు గ్రాముల 400 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 915 గ్రాముల మిశ్రమ వెండి కానుకల రూపంలో భక్తులు సమర్పించుకున్నారు. అమెరికన్ ఒక డాలర్ సమర్పించుకున్నారు. రెండేళ్ల క్రితం హుండీల ద్వారా రూ.14,05,350 ఆదాయం కాగా ఈ ఏడాది రూ.14,22,693 సమకూరింది. గత జాతర కంటే రూ.17,343 ఆదాయం అదనంగా వచ్చింది. జాతర పర్యవేక్షణాధికారి రంగు రవికిషన్‌గౌడ్, ఈవో ముక్తా రవి పాల్గొన్నారు.

ఘనంగా గాంధారి మైసమ్మ జాతర



మైసమ్మ తల్లి వద్దకు బోనాలతో మహిళలు



పట్నాలు సమర్పిస్తున్న ఆదివాసీలు

- రెండోరోజు పూజలు, అభిషేకాలు
- జిల్లాల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులో గాంధారి మైసమ్మ జాతరకు రెండో రోజు శనివారం ఆదివాసీ నాయక్‌పోడ్‌లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మూడు రోజుల జాతరలో భాగంగా సదర్ భీమన్న వద్ద దేవతామూర్తులకు అభిషేకాలు చేశారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి జలంతో అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. రాత్రి అక్కడి నుంచి దేవతామూర్తులను జాతర జరిగే గాంధారి ఖిల్లా దిగువ భాగంలోకి గజాలు, తప్పెటగూళ్ల ఆటలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ దేవతామూర్తులను ఉంచి జీడికోటలో రాత్రి లక్ష్మీదేవర నృత్యాలు, తప్పెటగూళ్ల నృత్యాలు, ఆదివాసీల సంప్రదాయ ఆటపాటలతో దేవతామూర్తులను ఆనందపరిచారు. ఖిల్లా దిగువ భాగంలోని నీటి చెలిమె వద్ద పూజారులు హారతినిచ్చిన అనంతరం పవిత్ర గంగాజలాలతో మహిళలు మైసమ్మ వద్దకు తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా గాంధారి మైసమ్మ జాతరలో పాల్గొనేందుకు జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన ఆదివాసీ నాయక్‌పోడ్‌లతోపాటు వివిధ జిల్లాల నుంచి నాయక్‌పోడ్‌లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, సంఘ పెద్దలు, నాయకులు గుండ రాజేష్, మార్నేని భూమేష్, రవి, రెడ్డి లక్ష్మణ్, బైర్నేని లక్ష్మణ్, శ్రీనివాస్, మేసినేని రాజయ్య, గంజి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


ఐశ్వర్య (ఫైల్)

జన్నారం: పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం... జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన రత్నం ఐశ్వర్య (21) రెండేళ్ల క్రితం వివాహమైంది. భర్తతో విబేధాలు రావడంతో సంవత్సరం క్రితం విడాకులు తీసుకుంది. కొన్ని నెలలుగా ఐశ్వర్య విడిపోయిన భర్తతో మళ్లీ మాటలు కలిశాయి. ఇద్దరు తరచుగా ఫోన్‌లో మాట్లాడుకునేవారు. భర్త గత రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి ఐశ్వర్య మానసికంగా కుంగిపోయింది. శనివారం ఉదయం బాత్‌రూమ్‌లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయి కనిపించింది. వెంటనే 108లో జన్నారం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తల్లి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో విద్యార్థిని మృతి


సహస్ర (ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన చుక్క సహస్ర (8) జ్వరంతో శనివారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో చుక్క దామోదర్– జ్యోత్స్నలకు క్రిషిత, సహస్ర ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు సహస్ర ఐదైరు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. సమ్మక్క మొక్కులు తీర్చుకోవడానికి నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులంతా కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి సమీపంలోని మంగళపల్లికి వెళ్లారు. అక్కడ కూడా జ్వరం తగ్గకపోవడంతో చొప్పదండిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించినప్పటికీ నయం కాలేదు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. విద్యార్థిని పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది.

లారీ ఢీకొని ఇల్లు ధ్వంసం


ఇంటిని ఢీకొట్టిన లారీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన సత్తయ్య ఇంటిని శుక్రవారం అర్ధరాత్రి లారీ ఢీకొనడంతో ఇల్లు ధ్వసమైంది. మంచిర్యాల జిల్లా భీమిని మండలం అక్కల్లపల్లి నుంచి నీలగిరి లోడ్‌తో కాగజ్‌నగర్ వైపు వస్తున్న లారీ సత్తయ్య ఇంటి వద్ద ఎత్తుగా ఉండడంతో ముందుకు వెళ్లలేక వెనుకకువచ్చి ఇంటిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఒక గదితో పాటు సామగ్రి ధ్వంసమైంది. అదృష్టవశాత్తు సత్తయ్య కుటుంబీకులు మరో గదిలో నిద్రిస్తుండడంతో ప్రమాదం తప్పింది. ఘటన జరిగిన అనంతరం లారీని వదిలివేసి డ్రైవర్ పారిపోయాడు. ఈ విషయమై ఈజీగాం పోలీసులను విచారించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

భయం వీడితే జయమే..

- పరీక్షల వేళ ఒత్తిడిని దరిచేరనివ్వద్దు
- ప్రశాంతతతోనే మంచి ఫలితం
- ఒత్తిడిని జయిస్తేనే విజయమంటున్న నిపుణులు
- మరో మూడురోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం


విద్యార్థుల సన్నద్ధతను పర్యవేక్షిస్తున్న డీఐఈవో పరశురాం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: విద్యా సంవత్సరం మొత్తం చదువులు, ప్రత్యేక తరగతులు, రివిజన్, సెమి ఫైనల్ పరీక్షలు, ప్రయోగపరీక్షలు.. అన్ని దాటుకుంటూ తుది పరీక్షల వరకు వచ్చేశారు ఇంటర్ విద్యార్థులు. చివరి దశ పరీక్షలు అనే సరికి మనసులో ఆందోళన ఉంటుంది. తక్కువ మార్కులు వస్తే, ఫెయిల్ అయితే ఎలా అనే ఆందోళనతో ఒత్తిడికి గురవుతుంటారు. పరీక్షలు జీవితంలో భాగం మాత్రమేనని ఎంతో భవిష్యత్ ముందుంటుందని విద్యావేత్తలు మానసిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రశాంతంగా చదివితే సరిపోతుందని, ఫలితం ఏ విధంగా వచ్చిన స్వీకరించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. గతేడాది రాష్ట్రస్థాయి మార్కులతో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులు పలు సూచనలిస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ఈ ఐదు రోజులు ఇలా చేయాలి...

- విద్యార్థులు తెల్లవారుజామున 5గంటలకు లేచి రివిజన్ చేయాలి. ఉదయం పూట చదవడంతో పాఠ్యాంశాలు తొందరగా మదిలోకి ఎక్కుతాయి. ఎక్కువ కాలం పాటు జ్ఞాపకం ఉంటాయి.
- రోజువారి సమయం ప్రకారం సబ్జెక్టుల వారీగా సమయాన్ని విభజించుకోవాలి..
- పరీక్షలకు మధ్యలో సెలవులు వచ్చిన వాటికంటే వరుసగా ఉన్న పరీక్షల పాఠ్యాంశాలను ఎక్కువ సమయం పాటు రివిజన్ చేయాలి.
- కఠినమైన అంశాలను రాస్తూ అధ్యయనం చేయాలి. బట్టీ పట్టకుండా సబ్జెక్టును సమగ్రంగా ఆకలింపు చేసుకోవాలి.
- చదివిన అంశాన్ని చూడకుండా కాగితం పై రాస్తూ సాధన చేయాలి..
- పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్లు టీవీలు వంటి వాటికి దూరంగా ఉండడం మంచిది.

తల్లిదండ్రుల బాధ్యత ఏమిటి..?

తల్లిదండ్రులు ఇంటర్ చదువుతున్న తమ పిల్లల్ని మార్కుల విషయంలో ఒత్తిడికి గురిచేయకుండా ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేయాలి. పరీక్షలు పూర్తయ్యే వరకూ ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండేలా ఇంట్లో వాతావరణాన్ని సృష్టించాలి. వారిని కోపగించుకోకుండా సరైన సాత్విక ఆహారం అందిస్తూ ఇన్ని రోజులు చదివిన పాఠ్యాంశాలను రివిజన్ చేయమని సూచించాలి. పాఠ్యాంశ విషయాలను నిపుణులైన అధ్యాపకుల చేత సందేహ నివృత్తి చేసేలా సదుపాయం కల్పించాలి.

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు..

జిల్లా	కాలేజీలు	విద్యార్థులు
నిర్మల్	63	13,345
మంచిర్యాల	66	15,529
ఆదిలాబాద్	77	21527
కుమురంభీం	48	10423

ప్రశాంతంగా చదివితే ఫలితం..



ఇంటర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఒత్తి డికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో ఉండా లి. పరీక్షలు ప్రారంభమయ్యాక పరీక్షకు సంబంధించిన పాఠ్యాంశాలను మాత్రమే చదవాలి. పూర్తయిన పరీక్షల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. – జాదవ్ పరశురాం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, నిర్మల్

శ్రమకు తగ్గ విశ్రాంతి అవసరం...



పరీక్షల కాలంలో విద్యార్థులలో సహజంగానే అంతర్గతంగా ఒత్తిడి ఉంటుంది. చదవడానికి శ్రమిస్తున్న వి ద్యార్థులు మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. ని రంతరం విరామం లేకుండా చదవడం కంటే మ ధ్యలో 15 నుండి 20 నిమిషాల పాటు మనసుకు విశ్రాంతినివ్వాలి. అలా ఉంటే మైండ్ కూడా రిఫ్రె ష్ అవుతుంది. దీంతో ఇంకా ఏకాగ్రతతో అదనంగా చదవడానికి అవకాశం ఉంటుంది. సమతుల ఆహారం, సరైన మోతాదులో నీరు తీసుకోవాలి.

– డాక్టర్ అల్లాడి సురేష్, ఎండీ, సైకియాట్రిస్ట్, మానసిక వైద్య నిపుణులు, నిర్మల్

ఒత్తిడికి గురికావొద్దు...



పరీక్షలు రాసే విద్యార్థులకు ఒత్తిడితో కూడిన ఆందోళనకు గురవుతారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి ప్రయత్నించాలి. పరీక్షలకు ముందు రోజు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపాలి. కొత్త పాఠ్యాంశాల జోలికి వెళ్లకుండా రిపీట్ చేయాల్సిన అంశాలనే చూసుకోవాలి. నేను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివి 2023 ఇంటర్ ఫలితాల్లో 987 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించాను. – భవానీ హాసిని, గతేదాది రాష్ట్రస్థాయి 3వ ర్యాంకర్, నిర్మల్

సానుకూలవైఖరే ఆయుధం...



నేను గత ఏడాది బైపీసీలో 987 మార్కులు సాధించాను. ఖచ్చితంగా మంచి ఫలితాన్ని సాధిస్తాననే వైఖరితో పరీక్షలను ఎదుర్కోవాలి. పరీక్ష రోజు ఆందోళన చెందకుండా పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. వచ్చిన ప్రశ్నలకు సమాధానాలను రాస్తూ వెళ్లాలి. రాని సమాధానాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తరగతి గదిలో విన్న అంశాలను ప్రశాంతచిత్తంతో ఆలోచిస్తే అవే గుర్తుకు వస్తాయి. – జి.వినాయక్, నిర్మల్

ఆత్మవిశ్వాసంతో పరీక్షల్ని ఎదుర్కోవాలి..



నేను నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశాను. గతేదాది రాసిన పరీక్షల్లో 986 మార్కులతో రాష్ట్రస్థాయి స్థానం లభించింది. అన్ని పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి. పరీక్షల రోజుల్లో ఎంత చదివాం అన్న దానికంటే ప్రశ్న పత్రంలోని సమాధానాలను ఎంత విజయవంతంగా ప్రజెంట్ చేశామన్నదానిపైనే మన మార్కులు ఆధారపడి ఉంటాయి. ప్రశ్నపత్రంలోని సమాధానాలను నిర్ణీత సమయంలో రాస్తే సరిపోతుంది. 225 – డీ. శ్రీజ, ఎంపీసీలో 986మార్కులు..

చెన్నూర్‌లో మూడిళ్లలో చోరీ

చెన్నూర్: దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేశారు. మేడారం జాతరకు వెళ్లిన వారి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. రెండ్రోజుల వ్యవధిలో మూడిళ్లలో దొంగతనం చేశారు. వివరాలిలా ఉన్నాయి. చెన్నూర్ పట్టణంలోని విశ్వకర్మ కాలనీకి చెందిన కొమ్మెర బ్రహ్మయ్య గురువారం హైదరాబాద్‌కు వెళ్లి శనివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చాడు. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లే క్రమంలో చోరీకి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వెనుక నుంచి గోడ దూకి పారిపోయాడు. బ్రహ్మయ్య గమనించి అరిచినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. తులంన్నర బంగారు గొలుసు, రింగు, రూ.40 వేలు నగదు ఎత్తుకెళ్లాడు. గత రెండ్రోజుల క్రితం ఆదర్శనగర్ కాలనీ ముల్కల్ల వీరారెడ్డి, ఆర్‌ఎంపీ సంపత్ మేడారం వెళ్లారు. రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు వెండి వస్తువులు, దేవుని వెండి ప్రతిమలు, రూ.2 వేల నగదు ఎత్తుకెళ్లారు. ముగ్గురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెన్నూర్‌లోని విశ్వకర్మ కాలనీలో ఇంట్లో నగదు చోరీ చేసిన దొంగలు

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బెల్లంపల్లిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. మైనింగ్ ఏడీ బాలు వివరాల ప్రకారం... కన్నెపల్లి మండలానికి చెందిన రెండు ట్రాక్టర్లు కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం అర్ధరాత్రి బెల్లంపల్లి మండలం చెర్లపల్లి గ్రామ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు నిర్ధారించారు. వాటిని తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. దీంతో పాటు బుధాకుర్దు గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మూడు ట్రాక్టర్లను తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఉంచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


పట్టుబడిన ట్రాక్టర్లు

అతిగా మద్యం తాగి ఒకరి మృతి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై నరేశ్

బెల్లంపల్లిరూరల్: అతిగా మద్యం తాగి ఒకరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన ఎరిగేటి భీమేష్ (37) ఆరేళ్లుగా తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామంలోని మిట్ట మల్లేష్ వద్ద పాలేరు(కూలీ)గా పని చేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భీమేశ్ మద్యానికి బానిసయ్యాడు. రోజు అతిగా మద్యం తాగడంతో అనారోగ్యానికి గురయ్యాడు. శనివారం ఉదయం భీమేశ్ మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలు రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత

తాండూర్: మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు స్పష్టం చేశారు. థర్డ్ లైన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మార్చి 12వ తేదీ వరకు రేచిని రోడ్‌లోని రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్‌లు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పత్తిమిల్లులో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం పత్తిని అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు స్పార్కింగ్ కావడంతో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. స్థానిక సిబ్బంది చెన్నూర్‌లోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకొని సిబ్బంది మంటలను ఆర్పేశారు. స్వల్పంగా పత్తి కాలి పోయినట్లు మార్కెట్‌శాఖ అధికారులు తెలిపారు.

మొసలి కలకలం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గోదావరి నదీ తీరాన మొసలి కనిపించడం కలకలం రేపింది. గోదావరి బ్యాక్‌వాటర్ తగ్గడంతో పక్షుల కోసం ఒడ్డుకు వచ్చి తిరిగి నీటిలోకి వెళ్లింది. అక్కడే ఉన్న పలువురు వీడియో తీయడంతో వైరల్‌గా మారింది. నిత్యం జాలర్లు చేపలు పట్టడం, ప్రజలు గోదావరినదిలో పుణ్యస్నానాలు చేస్తుంటారు. నదికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 28న సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈవో యాదయ్య అన్నారు. సైన్స్‌పై ఆసక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సైన్స్ సెమినార్, చిత్రలేఖనం, సైన్స్ పరికరాల ప్రదర్శన, ప్రయోగ ప్రదర్శనలు నిర్వహించాలని అధికారి మధుబాబుకు పంపించాలని తెలిపారు.

కనుల పండువగా సామూహిక యజ్ఞం


సామూహిక యజ్ఞంలో భక్తులు

- జాతరకు పోటెత్తిన భక్తులు


ఆలయానికి పోటెత్తిన భక్తజనం

జన్నారం: జన్నారం మండలం కలమడుగు నరనారాయణ స్వామి 39వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతరలో భాగంగా రెండవ రోజు శనివారం సామూహిక యజ్ఞం కనుల పండువగా నిర్వహించారు. ఇందులో 40 మంది దంపతులు పాల్గొన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఎంపీటీసీ స్వరూపరాణిల దంపతులు యజ్ఞం నిర్వహించారు. పూజారులు కాకర నర్సయ్య శర్మ, రాజనరేంద్ర శర్మల ఆధ్వర్యంలో ఉదయం నరనారాయణ స్వామి, ఆంజనేయ స్వామి దేవతామూర్తులకు పలు జంటలు అభిషేకం చేశారు. గీత ధర్మ ప్రచార కేంద్రం అర్చకులు శ్రీహరి మౌనస్వామి, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ రాజుగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కిషన్ గౌడ్, బొంతల మల్లేశ్, అంజగౌడ్, అంజన్న, గట్టు మల్లేశ్, శ్రీనివాస్, శంకరయ్య, రంగన్న , సదాశివ్ ఉన్నారు.


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇరు జట్లు

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు

కలమడుగు శ్రీనరనారాయణ స్వామి జాతరను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో భాగంగా మొదటి రోజు పది జట్ల మధ్య హోరాహోరీ పోటీలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ రాజుగౌడ్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొంతల మల్లేశ్‌లు పోటీలను ప్రారంభించారు. మొత్తం 27 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10వేలు నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.5వేలతో పాటుగా ట్రోఫీలను అందజేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి–పెద్దబండ గ్రామాల మధ్య గల వేంపల్లి రైల్వేగేటు వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై డికొండ రమేష్ వివరాల ప్రకారం... లెండుగురె అజయ్(20) కొంత కాలంగా చిన్నాన్న అయిన లెండుగురె రాజారాం వద్ద చింతలమానెపల్లి మండలం బారెగూడ గ్రామంలో ఉంటున్నాడు. 15రోజుల క్రితం కొటాల గ్రామానికి వచ్చాడు. కొటాలకు చెందిన రాజేష్, బోదంపల్లి గ్రామానికి చెందిన కొట్రంగి శ్రీశైలంతో శుక్రవారం కాగజ్‌నగర్‌కు వెళ్లాడు. రాత్రి సమయంలో కాగజ్‌నగర్ నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా రైల్వేగేటు వద్ద రాజేష్ అతివేగంగా బైక్ నడపడంతో రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయారు. దీంతో అజయ్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

డబ్బా గ్రామంలో విషాదం...


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


లెండుగురె అజయ్ (ఫైల్)

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన లెండుగురె అజయ్ (20) సిర్పూర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. అజయ్ కుటుంబీకుల వద్ద ఉంటూ కౌటాల మండల కేంద్రంలోని ఇంటర్ కళాశాలలో సెకండియర్ చదువుకుంటున్నాడు. మృతదేహం శనివారం సాయంత్రం ఇంటికి చేరడంతో మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

కనీస పెన్షన్ రూ.1000

శ్రీరాంపూర్: రిటైర్డ్ బొగ్గు గని కార్మికులకు త్వరలో కనీస పింఛన్ రూ.1000 అమలవుతుందని బీఎంఎస్ వేజ్‌బోర్డు, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు కె.లక్ష్మారెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు ఈ నెల 22న ఢిల్లీలో సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డ్ సమావేశం జరిగిందని, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు త్వరలో కనీస పెన్షన్ అమలవుతుందని చెప్పారు. సీఎంపీఎఫ్ సేవలన్ని మే చివరి నాటికి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవుతుందని కమిషనర్ హామీ ఇచ్చినట్టు వివరించారు. పెండింగ్‌లోని సీఎంపీఎఫ్ కేసులు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

ఇంటర్నల్ అభ్యర్థులను తీసుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ విడుదల చేసిన ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో ఇంటర్నల్ అభ్యర్థులకు ప్రత్యేక కోటా ఇవ్వాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. ఖాళీ పోస్టుల్లో 60 శాతం ఎక్స్‌ట్రనల్, మిగిలిన 40 శాతం ఇంటర్నల్ వారితో భర్తీ చేయాలని, కంపెనీలో ఈ పోస్టులకు ఉద్యోగ అర్హత గలవారు ఉన్నారని, ఈ పోస్టుల్లో 40 శాతం ఇంటర్నల్ వారితో భర్తీ చేస్తే కంపెనీకే మరింత మేలు జరుగుతుందని తెలిపారు.

‘బీజేపీ జెండా ఎగరవేయాలి’

శ్రీరాంపూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ కామారెడ్డి ఎమ్మెల్యే కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఎస్సార్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వమే వస్తుందని, సింగరేణి సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్మికులు బీజేపీ ఎంపీలను గెలిపిస్తే వారు కార్మికుల పక్షాన తమ గళం వినిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్ రావు, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు సత్రం రమేశ్, కమలాకర్ రావు, కాదాసి భీమయ్య, కుర్ర చక్రవర్తి, సత్యనారాయణ, మహేందర్ రత్నం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


దేవేందర్‌రెడ్డి(ఫైల్)


సైఫ్(ఫైల్)

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని కత్తెరసాల వాగు సమీపంలోని బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కంకణాల దేవేందర్‌రెడ్డి(40), సైఫ్ (20) సంఘటన స్థలంలో మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ వివరాల ప్రకారం... ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కంకణాల మహేందర్‌రెడ్డి బైక్‌పై తన గ్రామానికి వెళ్తున్నాడు. అలాగే చెన్నూర్ పట్టణానికి చెందిన ఫ్రిజ్ మెకానిక్‌లు సైఫ్‌తో పాటు హబీద్‌తో కలిసి మరో బైక్‌పై అంగ్రాజ్‌పల్లి వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంగ్రాజ్‌పల్లి నుండి చెన్నూర్ వైపునకు వస్తున్న బోలేరే వాహనం కత్తెరసాల బ్రిడ్జి సమీపంలో రెండు బైక్‌లను ఢీకొట్టింది. దీంతో వేర్వేరు బైక్‌లపై ఉన్న దేవేందర్‌రెడ్డితో పాటు సైఫ్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మెకానిక్ హబీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల పాలైన హబీద్‌ను మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. దేవేందర్‌రెడ్డి ఎల్ఐసీ ఏజెంటుగా, ఆర్ఎంపీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు బెల్లంపల్లికి చెందిన ఓ విద్యార్థి ఎంపికయ్యాడు. గత నెలలో నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. బెల్లంపల్లి సేయింట్ ఆంథోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అల్లం కుందన్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 26 –29 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పరిమళ ప్రకటించాడు.